

డోన్ ఏసీడీపీఓకు పదోన్నతి

నంద్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖలో డోన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీవోగా పనిచేస్తున్న కె.సౌజన్యలక్ష్మికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. గుంటూరులోని ఐసీడీఎస్ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆమెకు ప్రమోషన్ కల్పిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ.సూర్య కుమారి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రావణం.. పరమపవిత్రం...



- ఆధ్యాత్మిక భావాలకు నెలవు
- సంప్రదాయాలకు కొలువు
- నేటి నుంచి 'శ్రావణ మాసం' ఆరంభం

నంద్యాల కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు మాసాల్లో ఎంతో విశిష్ట మైనదిగా భక్తులు భావించే 'శ్రావణ మాసం' శుక్రవారం ప్రారంభమవుతోంది. ఆషాడ మాసం సందర్భంగా నెలరోజుల పాటు శుభకార్యాలకు దూరంగా ఉన్న ఉమ్మడి జిల్లా వాసులు పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతరత్రా శుభకార్యాలకు ఈ మాసంలో శ్రీకారం చుట్టనున్నారు. మరోవైపు ఆయా ప్రాంతాల్లోని దేవాలయాల్లో, ఉమ్మడి జిల్లాలోని పుణ్యక్షేత్రాల్లో శ్రావణ మాసం ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో జిల్లాలో యాత్రికుల సందడి కూడా బాగా పెరగనుంది. శ్రావణమాసం ప్రత్యేకించి మహిళలకు ఎంతో ప్రీతికరమైనది. ఈ మాసం ధార్మిక, ఆధ్యాత్మిక, భక్తిభావుకత అంశాలతో ముడిపడి ఉండటంతో పాటు వివాహ, గృహ ప్రవేశ, గృహ నిర్మాణ, నామకరణ మహోత్సవాల వంటి అనేక శుభకార్యాలకు విడిదిగా నిలుస్తోంది. పెళ్లి సంబంధాల నిర్ణయానికి, పెళ్లిళ్ల నిర్వహణకు అనువైన మాసం కావడంతో మాసారంభం కోసం అన్ని వర్గాల వారు ఎదురు చూస్తుంటారు. ఆషాడ మాసం గురువారంతో ముగిసిపోగా శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతోంది.

మిగతా 6వ పేజీలో

శ్రీశైలంలో నేటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు

నంద్యాల కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో శుక్రవారం నుంచి శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం వసతి, మంచినీటి సరఫరా, సౌకర్యవంతమైన దర్శనం, సాధారణ రోజుల్లో స్వామి, అమ్మవార్ల అర్జితసేవలు, అన్నప్రసాదాల వితరణ, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్ వంటి ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. శ్రావణ మాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శని, ఆది, సోమ వారాలు, వరలక్ష్మీవ్రతం, శ్రావణపౌర్ణమి, మొదలైన రోజుల్లో గర్భాలయ, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు ఈవో తెలిపారు. మరిన్ని ఆలయంలోని కార్యాలయంలో గాని ఆలయ వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించారు.

రీసర్వే మంచి పరిష్కార వేదిక

- ప్రామాణికతను పాటిస్తూ సర్వే చేయాలి
- సర్వే, భూరికార్డుల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకటేశ్వరరావు
- జిల్లా సర్వేయర్లతో రీసర్వేపై సమీక్ష



సమీక్షిస్తున్న రీజినల్ జాయింట్ డైరక్టర్ వెంకటేశ్వరరావు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించేందుకు రీసర్వే ఒక మంచి పరిష్కారవేదిక అని సర్వే, భూరికార్డుల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకటేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా సర్వేయర్లతో రీసర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ సర్వేయర్లు సర్వే సమయంలో భూయజమానుల సహకారంతో ప్రామాణికతలను పాటిస్తూ సర్వే చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2027 నాటికి భూముల రీసర్వే పూర్తిచేయాలని ఆదేశించిందన్నారు. అందుకు అనుగుణంగా గ్రామ సర్వేయర్లు ఆధునిక సర్వే సాంకేతిక పరికరాలతో కచ్చితత్వంతో కూడిన రికార్డులను తయారుచేయాలని కోరారు. నిర్దేశించిన సమయం లోపు రైతులను దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం సర్వేయర్‌లు అందజేసిన గ్రామాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. సమావేశంలో జిల్లా అధికారి జయ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన పెంచండి

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) విజయానంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శి, బంగారు కుటుంబాల గుర్తింపు కార్యక్రమాన్ని త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారిని ఆదేశించారు. విద్యుత్, ఇసుక, గృహనిర్మాణం, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు లైసెన్స్‌ల జారీ తదితర సేవలను పారదర్శకంగా అందించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీ4 కార్యక్రమంలో భాగంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న పేద కుటుంబాలను గుర్తించి వారిని అభివృద్ధి చేయాలని అధికారులను సూచించారు. జిల్లాకు సంబంధించి ప్రగతి డేటాలో ప్రభుత్వం నిర్దేశించిన డాక్యు మెంట్‌లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నేర నియంత్రణే లక్ష్యం..

- అంకితభావంతో విధులు నిర్వహించండి
- ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా
- డ్రోన్ ఆపరేటర్లతో సమీక్ష

నంద్యాల టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణే లక్ష్యంగా డ్రోన్ ఆపరేటర్లు పని చేయాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శిక్షణ పొందిన డ్రోన్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విధుల్లో నైపుణ్యాన్ని ఏవిధంగా పెంచుకోవాలో వీడియోలు, ఫొటోల రూపంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సందర్భం ఏదైనా డ్రోన్ కెమెరాతో నిఘా ఉంచాలన్నారు. పోలీస్ అధికారులు తమకు అంటూ ఓగుర్తింపు వచ్చేలా విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ, కర్నూలు జిల్లా ఎస్పీ

- నేర నియంత్రణకు కృషి చేయాలి
- నేర సమీక్ష సమావేశంలో డీఐజీ
- ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలు

7

భారీవర్షం

మహానందిలో అత్యధిక వర్షపాతం



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లావ్యాప్తంగా బుధవారం రాత్రి పలుచోట్ల భారీవర్షాలు కురిశాయి. మహానంది 38.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. నంద్యాల పట్టణం 23.8, బండిఆత్మకూరు 22.2, రుద్రవరం 21.6, ఆళ్లగడ్డ 21.4, నంద్యాల రూరల్ 19.2, చాగలమర్రి 17.6, వెలుగోడు 14.6, దొర్నిపాడు 13.6, గోస్పాడు 13.4, శిరువెళ్ల 13.2, మిడ్తూరు 11.2, డోన్ 10.6, కొలిమిగుండ్ల 10.4, కోవెలకుంట్ల 10.0, పాణ్యం 8.2, బనగానపల్లె 8.0 ఎంఎం వర్షపాతం నమోదైంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాల్లో పిల్లలను పడుకోనివ్వవద్దని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మట్టి ఇండ్లను గుర్తించి వాటిలో ఉండడానికి అనుమంతిచొద్దని, ఏదైనా అలసత్వం వహిస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీశైలంలో హుండీల లెక్కింపు

- దేవస్థానానికి రూ.4.17 కోట్ల ఆదాయం
- ఈవో శ్రీనివాసరావు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో శ్రీనివాసరావు

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం లోని హుండీలను గురువారం ఆలయ ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లెక్కించారు. 27రోజులకు గాను హుండీలను లెక్కించగా రూ.4,17,61,215 నగదు, 225గ్రాముల 600మిల్లీ గ్రాముల బంగారు, 11కేజీల 500గ్రాముల వెండి లభించినట్లు ఈవో తెలిపారు. 475 యుఎస్‌ఏ డాలర్లు, 70 యుఏఇ దిర్హమ్స్, 1300ఓమన్ బైసా, 155 కెనడా డాలర్లు, 305 ఆస్ట్రేలియా డాలర్లు, 40 ఇంగ్లాండు పౌండ్స్, 2సింగపూర్ డాలర్లు, 50న్యూజిలాండ్ డాలర్లు, 5స్కాట్లాండ్ పౌండ్స్, 30 ఈరోస్, 1సౌదీరియాల్స్, 51కత్తార్ రియాల్స్, 1మలేషియా రింగిట్స్, 200 ఇథోపియాన్ బిర్, 220 శ్రీలంక కరెన్సీ రూపాయలు, 160 నేపాల్ రూపాయలు మెదలైన విదేశీ కరెన్సీ కూడా ఈహుండీ లెక్కింపులో లభించాయి. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అన్ని యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.

కీలక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం..!

- అవుకులో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ
- రూ.53 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ రక్షణ పనులు
- డోన్‌లో రెండు పవర్ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

7

మళ్లీ ఆశలు



ఆదోని పట్టణం ఏరియల్ వ్యూ

- తెరపైకి ఆదోని జిల్లా!
- నాలుగు మండలాలుగా ఆదోని?
- పలు గ్రామాలు సమీప మండల్లాల్లో కలిపే అవకాశం
- కర్నూలు జిల్లాలో డోన్, నందికొట్కూరు కలపాలని సర్వత్రా డిమాండ్లు
- జిల్లాలు, మండలాల పునర్విభజనపై మంత్రుల కమిటీ
- ఉమ్మడి జిల్లాలో మొదలైన రాజకీయ చర్చలు

మళ్లీ తెరపైకి ఆదోని జిల్లా

జిల్లాల పునర్విభజనలో భాగంగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఓ కమిటీని మంగళవారం నియమించింది. జిల్లాల పేర్ల మార్పు, డివిజన్లు, మండలాలు, గ్రామాల సరిహద్దులపై ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించి పరిశీలించడంతో పాటు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఆ నివేదిక ఆధారంగా మంత్రివర్గం, అసెంబ్లీలో చర్చించి పునర్విభజనపై కూటమి ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది.

మిగతా 6వ పేజీలో

గతంలో జగన్ ప్రభుత్వం పార్లమెంట్ స్థానాల ప్రాతిపదికన 2022లో జిల్లాల పునర్విభజన చేపట్టిన సంగతి తెలిసిందే. నాటి పునర్విభజన కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లా కర్నూలు, నంద్యాల జిల్లాలుగా విడిపోయాయి. నంద్యాల జిల్లా జలవనరుల రాజధానిగా మారితే, కర్నూలు జిల్లా కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా మిగిలింది. ఒక్కో లోక్‌సభ స్థానానికి ఒక్కో జిల్లాగా చేయడంతో కర్నూలు జిల్లా కేంద్రానికి సమీపంలోని డోన్, నందికొట్కూరు వంటి నియోజకవర్గాలు నంద్యాల జిల్లాలో కలిశాయి. నంద్యాల లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న పాణ్యం నియోజక వర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు మండలాలు సహా కర్నూలు అర్బన్ వార్డులను కర్నూలు జిల్లాలోనే ఉంచారు. ఇదే క్రమంలో ఆదోని కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేసినా ఆచరణకు నోచుకోలేదు. 40 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రభుత్వం మండల వ్యవస్థ తీసుకొచ్చారు. మండలాల ఏర్పాటులో రాజకీయ జోక్యం పెరిగి పలు గ్రామాలు సమీపంలోని మండలాల్లో కాకుండా 30-40 కి.మీల దూరంలోని మండలాల్లో కలిపారు. తాజాగా జిల్లాల పునర్విభజన మంత్రుల కమిటీ జిల్లాల పేర్ల మార్పు, డివిజన్లు, మండలాలు, గ్రామాల సరిహద్దులపై విన్నపాలను పరిశీలిస్తోంది. ఈ క్రమంలో పునర్విభజనపై ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది.

కర్నూలు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు ఎంతో ఘన చరిత్ర ఉంది. 1839లో బ్రిటీష్ ప్రభుత్వం వచ్చాక మద్రాస్ ప్రెసిడెన్సి జిల్లాల్లో కర్నూలు ఒకటిగా ఉండేది. స్వాతంత్ర్యం తరువాత మద్రాస్ రాష్ట్రంలో ఉన్న జిల్లా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం ఫలితంగా కర్నూలు రాజధానిగా 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించింది. 1956 అక్టోబరు 31 వరకు కర్నూలు రాజధానిగా కొనసాగిందింది. 1953 నుంచి 12 అసెంబ్లీ నియోజకవర్గాలు, 53 మండలాలతో రాయలసీమలో అతిపెద్ద జిల్లాల్లో కర్నూలు ఒకటిగా ఉండేది. 2009లో నియోజక వర్గాల పునర్విభజన వల్ల 14 నియోజకవర్గాలకు విస్తరించింది. రాజకీయంగా, చరిత్రాత్మకంగా, సాంస్కృతికంగా, భౌగోళికంగా ఎంతో ఘన చరిత్ర కలిగిన కర్నూలు. 2022లో జిల్లాల పునర్విభజన కారణంగా గత వైభవాన్ని కోల్పోయింది. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలు పూర్తిగా, పాణ్యం నియోజకవర్గం పరిధిలో రెండు మండలాలు కలిపి 26 మండలాలతో కర్నూలు జిల్లా మిగిలింది. అదేవిధంగా నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం, బనగానపల్లె, నందికొట్కూరు, డోన్ నియోజక వర్గాలు, పాణ్యం నియోజక వర్గంలోని పాణ్యం, గడివేముల మండలాలు కలిపి 27మండలాలతో నంద్యాల జిల్లాగా ఆవిర్భవించింది. సాగునీటి ప్రాజెక్టులు నంద్యాల జిల్లాలో ఉండడంతో జలవనరుల రాజధానిగా మారింది. అప్పట్లో ఆదోని జిల్లా చేయాలని డిమాండ్ వచ్చినా పట్టించుకోలేదు.



ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

- అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరావు
- జీజీహెచ్ వసతులపై ఆరా
- క్రిటికల్ కేర్ భవనానికి కేటాయించిన స్థలం పరిశీలన



జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ వార్డును పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఈ డా.వెంకటేశ్వరరావు

నంద్యాల హస్పిటల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలో భవన నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. నవంబర్ లోపు పూర్తిచేసి భవనాన్ని అందజేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. కళాశాలలో విద్యార్థుల వసతులపై ప్రిన్సిపాల్ డా.సురేఖను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు భవనాలు సరిపోతున్నాయని, అవసరమైతే తాత్కాలికంగా ఉన్న భవనాలను కూడా ఉపయోగించుకుంటామని అడిషనల్ డీఎంఈకి తెలిపారు. జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరితో సమీక్ష నిర్వ హించారు. జీజీహెచ్ వసతులపై ఆరాతీశారు. ప్రస్తుతం 450బెడ్లు ఉన్నా యని, 3వ బ్యాచ్ వస్తే 620 కావాలని సూపరింటెండెంట్ అడిషనల్ డీఎంఈ దృష్టికి తెచ్చారు. బెడ్లు పెంచితే భవనం సరిపోదని ఇందుకు అడిషనల్ డీఎంఈ ఓపీ బిల్డింగ్‌ను, అడ్మిషన్ బిల్డింగ్‌లపై అదనపు అంత స్తులు నిర్మించేందుకు అవకాశం ఉందా అని అడిగారు. దీనికి ఏపీఎంఐసీ డీఈ నరసింహారెడ్డి ఓపీడీ భవనం అవకాశం ఉంటుందని, అడ్మిషన్ బిల్డింగ్ పురాతనమైందని తెలిపారు. క్రిటికల్ కేర్ భవనానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలంలో జీ ప్లస్5 అంతస్తులు కట్టి బెడ్లను పెంచు కునేందుకు అవకాశం ఉందని అడిషనల్ డీఎంఈ సూచించారు. 60బెడ్లతో క్రిటికల్ కేర్ భవనం నంద్యాల జీజీహెచ్‌కు ప్రభుత్వం మంజూరుచేసింది. దీనికి సంబంధించిన ప్లాన్‌లు తయారు చేసి పంపాలని ఏపీఎంఐసీ డీఈకి సూచించారు. జీజీహెచ్‌లోని ఎమర్జెన్సీవార్డును పరిశీలించారు. జీజీహెచ్‌లో శానిటేషన్, సెక్యూరిటీ సర్వీస్‌లు ఎలా ఉన్నాయని ఆరాతీశారు. ఏపీఎంఐసీ ఏఈ మురళి, ఆర్ఎంవో డా.వెంకటేష్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఇంట్లో పసిపిల్లలు పారాడితే చూడాలనుకునే పెద్దలు.. వారి బోసి నవ్వులతో మురిసిపోవాలనుకునే జంటలు చాలామంది ఉన్నారు. మహిళలు అమ్మతనం కోసం ఆరాట పడుతుంటారు. పలు కారణాలతో సంతాన లేమి సమస్య పెరుగుతూ వస్తోంది. వీటిని అధిగమిస్తూ వైద్య రంగంలో ఐవీఎఫ్ విధానం ఆవిష్కృతమైంది. 1978 జూలై 25న లూయిస్ జాయ్ బ్రౌన్ ఐవీఎఫ్ ద్వారా జన్మించిన మొదటి శిశువు. సంతానోత్పత్తి చికిత్స రంగంలో ఇది అతిపెద్ద విజయం. ఈ విజయానికి గుర్తుగా ప్రతి ఏడాది జూలై 25న ప్రపంచ ఐవీఎఫ్ డేగా జరుపుకుంటున్నారు. ఈ ఏడాది సంతానోత్పత్తి శాస్త్రంలో ఆవిష్కరణ, ఆశను జరుపుకోవాలి అన్న నినాదంతో నిర్వహిస్తున్నారు.

- సంతానప్రాప్తికి సాఫల్య చికిత్స
- 30 ఏళ్లలో దాటిన స్త్రీలలో తగ్గుతున్న సంతాన సామర్థ్యం
- కర్నూలులో 1.80, నంద్యాలలో 1.36 సంతానం రేట్
- నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే

అమ్మతనం కోసం ఆరాటం

కర్నూలు హాస్పిటల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో సంతానం లేనివారు తమకు జీవితంలో తల్లిదండ్రులు అయ్యే యోగ్యం లేదని సరిపెట్టుకునేవారు. ప్రస్తుతం వైద్యశాస్త్రం అభివృద్ధి చెందింది. కృత్రిమంగా గర్భధారణ చేసే విధానాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఆరు మందిలో ఒకరు సంతాన లేమితో బాధపడుతున్నారు. కర్నూలు జిల్లాలో ఫెర్టిలిటీ రేటు (2023-24) (టీఎఫ్ఆర్) 1.80గా ఉండగా.. నంద్యాల జిల్లాలో టీఎఫ్ఆర్-1.36గా నమోదైంది. వివాహాలు ఆలస్యంగా చేసుకోవడం, మారుతున్న జీవనశైలి మార్పులు, మగవారిలో కణాలు తగ్గిపోవడం వంటి కారణాలతో టీఎఫ్ఆర్ రేటు తగ్గుతున్నది.

జీవనశైలిలో లోపాలే..

సంతానలేమికి జీవనశైలిలో లోపాలే ప్రధాన కారణం. గర్భం దాల్చడానికి ముందు నుంచే శరీరంలోని ప్రతి కండరం కదిలేలా వ్యాయామం చేయాలి. లేదంటే శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరిగి ప్రీడయాబెటిక్ దశకు చేరుకుంటారు. దీంతో గర్భం దాల్చలేకపోవడం, ఒకవేళ వచ్చినా అబార్షన్ కావడం, మధుమేహం, ఇన్‌ఫెక్షన్లు పిల్లలో ఊపిరితిత్తుల సమస్యలెన్నో ఎదురు కావచ్చు. కార్బోహైడ్రేట్స్ తగ్గించి ప్రోటీన్ ఫుడ్ తీసుకోవాలి. వేడి ఆహారం తీసుకుంటూ, రక్తహీనత లేకుండా చూసుకోవాలి. ఒత్తిడికి దూరంగా ఉండాలి. లేకపోతే గర్భస్రావం నెలలు నిండకుండానే ప్రసవం అవ్వొచ్చు.

ఐయూఐ: దీన్ని ఇంట్రా యూటరిన్ ఇన్‌సెమినేషన్ అంటారు. భర్త నుంచి సేకరించిన వీర్యాన్ని ప్రయోగశాలలో పరీక్షిస్తారు. వీర్యంలో అసహజ కణాలు వంటివాటిని తొలగిస్తారు. ఆరోగ్యంగా ఉన్న వీరాన్ని సన్నటి, మెత్తటి గొట్టం ద్వారా నేరుగా స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశపెడుతారు.



పెరిగిపోతున్న టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లు

15 ఏళ్ల క్రితం కర్నూలు నగరంలో ఒక్కటే టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ఉండేది. రోజురోజుకు వీటి సంఖ్య పెరిగిపోతోంది. ప్రస్తుతం నగరంలో దాదాపుగా పది దాకా టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్లు ఉన్నాయి. హైదరాబాదుకు చెందిన కార్పొరేట్ సంస్థలు కూడా కర్నూలులో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం విశేషం.

ఐవీఎఫ్: ఐవీయూ పద్ధతిలో ఫలితం కనిపించని వారికి ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) చికిత్స చేస్తారు. దీన్నే టెస్ట్ ట్యూబ్ బేబీ అంటారు. ఇందులో ఆడవారి నుంచి పక్వమైన అండాలను బయటకు తీసి ప్రయోగశాలలో ఒక పాత్ర పెట్టి, మగవారి వీర్యకణాలతో ఫలదీకరణ చెందిస్తారు. ఈ ప్రక్రియలో ఏర్పడిన తొలిదశ పిండాల్లో రెండు మూడింటిని ఆడవారి గర్భంలో ప్రవేశపెడుతారు. అవి పెరగడం మొదలవుతాయి.

ఐసీఎస్: ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్. ఇందులో ఆడవారి నుంచి అండాలను సేకరించి, మగవారి వీర్యంలోంచి ఒక శుక్ర కణాన్ని తీసుకుని దాన్ని మైక్రోమానిప్యులేటర్ పరికరం ద్వారా అండంలోనికి ప్రవేశపెడుతారు. ఫలదీకరణ చెందిన వాటిని తిరిగి స్త్రీగర్భంలోకి ప్రవేశపెడుతారు. వీర్యకణాల సంఖ్య చాలా తక్కువగా ఉన్న మగవారిలో ఇది ఉపయోగపడుతుంది.



ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం..



2015లో కర్నూలులో విష్ణుప్రియా టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్‌ను ప్రారంభించాం. ఇప్పటి వరకు వేయి మందికి సంతాన సాఫల్య చికిత్సలు అందించాం. ఆలస్యంగా వివాహం చేసుకోవడం మంచిది కాదు. ఒత్తిడి, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. పెళ్లయిన తర్వాత ఏడాదికి పిల్లలు కలగకపోతే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ పి. విష్ణుప్రియ, విష్ణుప్రియా టెస్టు ట్యూబ్ బేబీ సెంటర్, కర్నూలు

75 శాతం అధిక విజయం..



సంతాన సాఫల్య కేంద్రాల్లో ఒయాసిస్ ఫెర్టిలిటీ కేంద్రం ఐవీఎఫ్ ద్వారా 70నుంచి 75శాతం అధిక విజయం సాధించింది. కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించి తక్కువ ఖర్చుతో గర్భదారణను సాధించడం ఒయాసిస్ ద్వారా సాధ్యమైంది. మహిళల్లో వయస్సు పెరిగే కొద్ది వారిలో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది.

- డాక్టర్ దాసరి విజయలక్ష్మి, ఒయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్, కర్నూలు

శ్రావణం.. పరమపవిత్రం...



(5వ పేజీ తరువాయి)

శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలు పెళ్లయిన, పెళ్లికాని ఆడవాళ్లకి ఎంతో ముఖ్యమైన వారాలుగా భావిస్తారు. ఈ ఏడాది ఈ మాసంలో ఐదు శుక్రవారాలు విచ్చేస్తున్నాయి. శ్రావణ మాసం శుక్రవారం రోజున ప్రారంభమవు తోంది. ఇందులో 2వ శుక్రవారం చాలా ముఖ్యమైంది. అది శుక్ల పక్ష పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఆరోజే 'వరలక్ష్మి వ్రతం' చేస్తారు. ఇది ముఖ్యంగా పెళ్లయిన ముత్తైదువులు చేసుకుంటారు. ఈ వ్రతం వల్ల లక్ష్మీదేవి కరుణా కటాక్షాలు అందుకుని సకల సిరిసంపదలు, పుత్ర పౌత్రభివృద్ధి, సుఖ సంతోషాలు కలుగుతాయని ప్రతీతి. శ్రావణ మంగళవారాలు కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు. దీనికి శ్రావణ మంగళవారం నోము ఉంటుంది. ఇది ఆచరిస్తే సౌభాగ్యవంతులు అవుతారని నమ్మకం. శ్రావణ మాసంలోని మంగళవారాల్లో చేసే 'మంగళ గౌరీ' వ్రతాలను గౌరీ నోములని కూడా అంటారు. ఈ వ్రతాలు చేస్తే వరలక్ష్మీ కటాక్షం, మంగళగౌరీ కటాక్షం కలుగుతాయని మహిళలు వీటిని ఆచరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో శ్రావణ శోభ

ఉమ్మడి జిల్లాలో శ్రావణ మాసాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఒక సంప్రదాయంగా వస్తోంది. శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, అహోబిలం, యాగంటి, తదితర సుప్రసిద్ధ దేవాయాలు, అనేక ధార్మిక కేంద్రాలకు నిలయంగా ఉన్న జిల్లాలో శ్రావణ మాసంలో భక్తుల సందడి కనిపిస్తోంది. శివకేశవులకు నెలవైన మాసం కావడంతో అన్ని వర్గాల భక్తులు తమ ఆరాధ్య దైవాలను పూజించేందుకు తరలివస్తారు. ఈ మాసం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. పెళ్లిళ్లు, వ్రతాలు, పూజలు, శుభకార్యాల వంటి వాటితో ఇల్లంతా సందడిగా ఉంటుంది. ఈ మాసంలో ఒక్కోరోజు ఒక్కో దేవున్ని పూజిస్తారు. సోమవారాల్లో శివునికి అభిషేకాలు, మంగళవారం గౌరీ వ్రతం, బుధవారం విఠలుడికి పూజలు, గురువారాల్లో షిరిడి సాయి, సత్యసా యి పూజలు, గురుదేవుని ఆరాధనలు, శుక్రవారాల్లో లక్ష్మీ, తులసి పూజలు, శనివారాల్లో తిరుమలేశునికి, హనుమంతునికి, శనీశ్వరుని పూజలు నిర్వహిస్తారు.

ఉరుకుంద ఈరన్నకు అమావాస్య పూజలు



కౌతాళం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. అమావాస్య కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు లక్ష పుష్పార్చన సేవలు కొనసాగించారు. అంతకుముందు ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి అలంకరణ చేపట్టి తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

పచ్చదన ప్రవాహం



పచ్చని చెట్ల మధ్య తెలుగుగంగ కాల్వలో కడప వైపు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

నల్లమల తీరంలోని తుండ్లవాగు రిజర్వాయరులో తెలుగుగంగ కాల్వ అందాలు గురువారం కనువిందు చేశాయి. తుండ్లవాగు రిజర్వాయరు నుంచి పచ్చని వృక్షాల మధ్య ప్రధాన కాల్వలో కడప వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ఎక్కడో కోనసీమ, కేరళ ప్రాంతాల్లో కనిపించే అద్భుత నదీ ప్రవాహ దృశ్యాలు నంద్యాల జిల్లాలోనూ ఇలా కనువిందు చేస్తున్నాయి.

- రుద్రవరం(ఆంధ్రజ్యోతి)

వాన కురిసె.. ఆనందం వెల్లివెరిసె..!

- జలకళను సంతరించుకున్న వాగులు, వంకలు
- పెరుగుతున్న భూగర్భజలాలు
- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- అందుబాటులో ఎరువులు : వరలక్ష్మి, జేడీ



తుంగభద్ర నదికి జలకళ

ఈసారి మళ్లీ కరువు పరిస్థితులు చూడాల్సి వస్తుందేమోనని కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల రైతులు ఆందోళన చెందారు. ఒక వైపు ఎండిపోతున్న పైర్లు, మరో వైపు పొలాల్లో విత్తనం వేసేందుకు అవసరమైన వర్షం లేక జూలై నెలారంభంలో రైతులు వరుణదేవుడా కరుణించవయ్యా అంటూ ప్రార్థించారు. ఇదే సమయంలో వరుణుడు కనికరించాడు. వానలు కురియడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భూగర్భజలాలు పెరిగాయి. చెరవులు, వాగులు, వంకలు నిండాయి. అన్నదాత సాగుకు సిద్ధమయ్యాడు.

కర్నూలు అగ్రికల్చర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో రైతుల్లో ఆనందం వెల్లివెరిసింది. కర్నూలు జిల్లాలో ప్రధానంగా పశ్చిమ ప్రాంతం జళకళను సంతరించుకుంది. చెరువులు, వాగులు, వంకల్లోకి జలాలు వచ్చి చేరుతున్నాయి. భూగర్భజలాలు కూడా పెరుగుతున్నాయి. ఇప్పటికే 60 శాతం పొలాల్లో పంటల సాగు జరిగింది. ఖరీఫ్ సాగు ఊపందుకుంది. జూలై నెలలో 72ఎంఎం కురవాల్సి ఉండగా.. ఇప్పటికే 74ఎంఎం వర్షం నమోదైంది. ఈనెలాఖరుకు ఇంకా వర్షపాతం ఊపందుకుంటుం దని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరో వారం రోజులు ఇలాగే వర్షం పడుతుందని చెబుతున్నారు. పత్తికొండ, కల్లూరు, కర్నూలు రూరల్, ఎమ్మిగనూరు, ఆలూరు, చిప్పగిరి, పాణ్యం, ఆదోని, హాలహర్వి మండలాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. ఒక వైపు తుంగభద్ర నదికి వరద పోటెత్తుతుండటంతో ఎల్లెల్సీ, కేసీ కెనాల్ కాలువలకు నీటిని వదులుతున్నారు. దీంతో ఆయకట్టు రైతులు వరి పంటను సాగు చేసేందుకు పొలం పనుల్లో బిజీ అయిపోయారు.

రానున్న వారం రోజుల్లో..



నాలుగు రోజులుగా వర్షాలు నేల తల్లిని తడిమేశాయి. అన్నిప్రాంతాల్లోనూ పంటల సాగుకు అనుకూలత ఏర్పడింది. ఇప్పటికే పొలాల్లో ఉన్న పైర్లు పచ్చగా కళకళాడుతుండటంతో కలుపులు తీసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. చెరువులకు నీరు క్రమంగా చేరుకుంటుంది. బోర్లు, బావుల్లోనూ భూగర్భ జలమట్టం పెరుగుతోంది. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య బాధలు తప్పిపోయాయి. రానున్న వారం రోజుల్లో ఇదే వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

60శాతం దాకా పంటల సాగు..



రైతులు ప్రస్తుతం పొలం పనుల్లో నిమగ్నవయ్యారు. జిల్లా అంతటా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఇప్పటికే 60శాతం దాకా పంటల సాగు పూర్తయింది. యూరియాతో పాటు డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు మార్క్‌ఫెడ్ ద్వారా డీసీఎంఎస్ కేంద్రాలు గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సంఘాలకు సరిపడ నిల్వలను అందుబాటులో ఉంచాం. ఎక్కడా యూరియా కొరత లేదు.

- వరలక్ష్మి, జేడీ, కర్నూలు

తెలుగు వారి గుండెల్లో 'జాషువా' స్థానం పదిలం



ప్రజాకవి గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి గుండెల్లో నవయుగ కవి చక్రవర్తిగా గుర్రం జాషువా స్థానం పదిలంగా నిలిచే ఉంటుందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు, కళారత్న పత్తి ఓబులయ్య కొనియాడారు. గురువారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో గుర్రం జాషువా 55వ వర్ధంతి సభని నిర్వహించారు. తొలుత జాషువా చిత్ర పటానికి పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ జాషువా ప్రజల పక్షాన నిలబడి రచనలు చేశారని, అందుకే ఆయన ప్రజా కవిగా నిలిచిపోయారన్నారు. ఆయన రాసిన గబ్బిలం, ఫిరదౌసి, ఆంధ్రభోజుడు, కాందిశీకుడు, శ్మశానవాటిక, క్రీస్తు చరిత్ర వంటి అనేక రచనలు ఔత్సాహిక రచయితలకు స్ఫూర్తినిస్తాయన్నారు. హరిశ్చంద్ర నాటకం కాటిసీనులో జాషువా పద్యాలతో ఒక ప్రత్యేకత చూపారని కొనియాడారు. ఆయన రాసిన క్రీస్తు చరిత్రకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందని గుర్తు చేశారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ద్వారా కళాప్రపూర్ణ, భారత ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ అందుకున్న మహనీయుడు జాషువా అన్నారు. కథా రచయిత ఇనాయతుల్లా వ్యాఖ్యానంతో ప్రారంభమైన ఈ సభలో రంగస్థల కళాకారులు, రిటైర్డ్ హెచ్ఎం మహ్మద్ మియా, పి.దస్తగిరి, కేవీ రమణ, సిద్దయ్య, శామ్యూల్ జాషువా పద్యాలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు పి.రాజారత్నం, క్రిష్టపర్, కె.బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, చంద్రకంటి మద్దయ్య, సంగీత గురువు బలరాం తదితరులు పాల్గొన్నారు.

కౌలూరు సర్పంచ్‌కు అరుదైన గౌరవం


ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు ఆహ్వానం



ఊడల బాలయ్య

పాణ్యం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండలంలోని కౌలూరు సర్పంచ్ ఊడల బాలయ్యకు అరుదైన గౌరవం లభించింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ గురువారం అధికారికంగా వెల్లడించినట్లు కౌలూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు. ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రంలో ముగ్గురిని ఎంపిక చేయగా వారిలో కౌలూరు సర్పంచ్ బాలయ్య ఎంపికయ్యారన్నారు. సర్పంచ్ బాలయ్య మాట్లాడుతూ గ్రామంలోని అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలు, పారిశుధ్యం తదితర విభాగాల్లో కృషి చేయడంతోనే ఈ అవకాశం దక్కిందన్నారు. ఇంత గొప్ప అవకాశం లభించడంలో ఎంపీటీసీ భాస్కరరెడ్డితోపాటు పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజల సహకారం కారణమన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కినందుకు ప్రభుత్వానికి, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మళ్లీ ఆశలు



ఆదోని పట్టణం ఏరియల్ వ్యూ

(5వ పేజీ తరువాయి)

2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేడితే, ఆదోని కేంద్రంగా ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాల (పాత రెవెన్యూ డివిజన్)ను కలుపుతూ ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వచ్చింది. ఆదోని జిల్లా సాధన సమితి ఏర్పాటుచేసి పలువురు పోరాటాలు కూడా చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడంతో మళ్లీ ఆదోని జిల్లా తెరపైకి వచ్చింది. 2027లో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కొత్తగా రెండు లేదా మూడు నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉంది. కర్నూలు, కోడుమూరు, పాణ్యం, నందికొట్కూరు, డోన్, కొత్తగా ఏర్పడే నియోజకవర్గంతో కలిపి ఆరు నియోజవకార్గతో కర్నూలు జిల్లా, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, శ్రీశైలం, కొత్తగా ఏర్పడే మరో నియోజకవర్గంతో కలిపి ఐదు నియోజకవర్గాలతో నంద్యాల జిల్లాను కొనసాగించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

నాలుగు మండలాలుగా ఆదోని

జిల్లాలో అతిపెద్ద మండలం ఆదోని. 46 రెవెన్యూ గ్రామాలు, 40 గ్రామ పంచాయతీలు ఉన్నాయి మండలం. 2011 గణాంకాల ప్రకారం 1.15 లక్షల జనాభా ఉంది. ప్రస్తుతం 1.50 లక్షలకు పైగా జనాభా పెరిగిందని అంచనా. ప్రతి నియోజకవర్గంలో 4-6 మండలాలు ఉంటే ఆదోని నియోజకవర్గం ఒకే మండలంగా ఉంది. పాలన పరంగానే కాకుండా నిధుల పరంగా కూడా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఆదోనికి అతి సమీపంలోనే పెద్దకడబూరు, ఆలూరు, ఆస్పరి మండలాలకు చెందిన దాదాపు పది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సరిహద్దులు, భౌగోళిక స్వరూపం, చారిత్రాక నేపథ్యం పరిశీలిస్తే, 10-12 గ్రామ పంచాయతీలు కలిపి ఒక మండలంగా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఆదోని, పెద్దతుంబళం, పెద్దహరివాణం లేదా మదిరె, మండిగిరి నాలుగు మండలాలుగా విభజించే అవకాశం ఉంది. 6 గ్రామ పంచాయతీలతో మద్దికెర మండలం ఏర్పాటు చేసినప్పుడు 40 గ్రామ పంచాయతీలు కలిగిన ఆదోని మండలాన్ని నాలుగు మండలాలుగా విభజించడంలో తప్పేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదే జరిగితే ఆదోని జిల్లాగా ఏర్పాటులో కూడా ఎంతో కీలకంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలాగే జిల్లాలో అతిపెద్ద మండలాల్లో దేవనకొండ ఒకటి. 44 గ్రామాలు, 36 గ్రామ పంచాయతీలు, లక్షకు పైగా జనాభా కలిగిన మండలం ఇది. ఈ మండలాన్ని కూడా ప్రజల సౌలభ్యం కోసం దేవనకొండ, తెర్నేకల్లు, పి.కోటకొండ మూడు మండలాలుగా విభజించాలనే డిమాండ్ బలంగా ఉంది. మూడు నాలుగు మజారా గ్రామాలతో ఉన్న పంచాయతీలను కూడా విభజించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

మారనున్న మండలాల సరిహద్దులు

- గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక స్వపరిపాలన, ప్రజల ముంగిటకే పాలన లక్ష్యంగా 1985లో అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రభుత్వం మండల వ్యవస్థను తీసుకొచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 మండలాలు ఏర్పాటు చేశారు. నాడు రాజకీయ జోక్యంతో పలు గ్రామాలు సమీపం మండలంలో కాకుండా 35-40 కి.మీల దూరంలో ఉండే మండలాల్లో కలపడంతో 40 ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- ఎమ్మిగనూరు పట్టణానికి 2-3 కి.మీల దూరంలో ఉండే హనుమాపురం గ్రామాన్ని 17-20 కి.మీల దూరంలో ఉండే పెద్దకడుబూరులో కలిపేశారు. అప్పట్లో ఈ గ్రామం దివంగత మాజీ ఎమ్మెల్యే కేఆర్ హనుమంతరెడ్డి ప్రాబల్యంలో ఉండేది. నాడు టీడీపీలో ఉన్న ప్రస్తుత వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి రాజకీయ ఆలోచనతో పెద్దకడుబూరులో కలిపేశారని అంటున్నారు. తాజాగా పునర్విభజన పక్కాగా జరిగితే హనుమాపురం గ్రామం ఎమ్మిగనూరు మండలంలో కలిపే అవకాశం ఉంది.
- కోడుమూడు పట్టణానికి కన్నూరు, మాచాపురం, బోదేపాడు, లింగందిన్నె గ్రామాలు 2-5 కి.మీల దూరంలో ఉన్నాయి. వీటిని 18-20 కి.మీల దూరంలో ఉన్న గోనేగండ్ల మండలంలో కలిపారు. ఈ గ్రామాల్లో అప్పట్లో దివంగత మాజీ సీఎం కోట్ల విజయ భాస్కరరెడ్డి ప్రాబల్యం కింద ఉండడంతో రాజకీయ జోక్యంతో గోనేగండ్లలో కలిపారు. కోడుమూరు మండలంలో విలీనం చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.
- కోసిగి మండల కేంద్రానికి పీకలబెట్ట, బాపులదొడ్డి, గవిగట్టు గ్రామాలు 3-6 కి.మీల దూరంలో ఉన్నాయి. వీటిని 17-20 కి.మీల దూరంలో ఉన్న పెద్దకడుబూరు మండలంలో కలిపారు. అలాగే 6 కి.మీల దూరంలో ఉన్న తిప్పలదొడ్డి గ్రామానికి 15 కి.మీల దూరంలో ఉండే కౌతాళంలో కలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆ గ్రామాలు కోసిగి మండలంలో కలపాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు.
- ఆదోని పట్టణానికి 8 కి.మీల దూరంలో ఉండే తంగరడోణ గ్రామాన్ని 20-22 కి.మీల దూరంలో ఉండే ఆస్పరి మండలంలో, 8-10 కి.మీల దూరంలో ఉండే మూసానపల్లి గ్రామాన్ని 20-22 కి.మీల దూరంలో ఉండే ఆలూరు మండలంలో కలిపారు.

బైక్ అదుపుతప్పి వీఆర్‌వోకు తీవ్ర గాయాలు

ఆళ్ళగడ్డ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా వీఆర్‌వోగా పనిచేస్తున్న వెంకటపతి బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డారు. గురువారం విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై ఎండకండ్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కుక్కల గుంపు వెంటపడింది. ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో వీఆర్‌వోకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రోజురోజుకూ కుక్కల బెడద అధికమౌతుందని, అధికారులు వెంకటనే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి బయట పడ్డానని బాధితుడి తెలిపారు.

ఎర్రగుడిలో ఘర్షణ.. ఐదుగురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు. గురువారం గ్రామానికి చెందిన వెంకటేశ్వ రరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి మధ్య గొడవ జరిగింది. తనపై వెంకటేశ్వరరెడ్డితో మరో ఐదుగురు దాడి చేసినట్లు బాధితుడు రామ్మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇదేమి విచారణో..!

- ఆరు నెలల క్రితం ఫిర్యాదు
- ఇప్పుడు విచారణకు వచ్చిన అధికారులు
- మూడు మాసాల కిందటే కథ సుఖాంతం



విచారణ చేస్తున్న అధికారులు

మద్దికెర, జూలై 24 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో కుమారుడి విషయంలో జాతీయ బాలల పరిరక్షణకు ఆరునెలల క్రితం ఫిర్యాదు చేశారు. అయితే అప్పుడు ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు ఆలస్యంగా స్పందించారు. కాగా ఇప్పటికే ఆదంపతులు రాజీ అయ్యారు. విచారణకు వచ్చిన అధికారులను ఇదేమి విచారణ బాబోయ్ అంటూ స్థానికులు అవాక్కయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మద్దికెరలోని రామ్‌నగర్‌లో నివసించే శ్రీరాములు, శ్రీదేవి దంపతుల కూతురు వరలక్ష్మి. ఐదేళ్ల క్రితం ఆమెను గుంతకల్లు పట్టణానికి చెందిన చరణ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి రెండేళ్ల క్రితం సంజయ్‌రాం అనే కొడుకు పుట్టాడు. ఎనిమిది నెలలుగా భార్యా భర్తలకు కుటుంబ కలహాలు వచ్చాయి. దీంతో ఆమె పుట్టినిల్లు అయిన మద్దికెరకు బాబుతో పాటు వచ్చి ఉంది. రెండు నెలల తర్వాత తన కొడుకు సంజయ్‌రాంను భార్య అవ్వతాతలు సరిగా చూడటం లేదంటూ చరణ్ ఆరు నెలల కింద జాతీయ బాలల సంరక్షణకు ఫిర్యాదు చేశారు. గురువారం డీసీపీవో శారద, ఎన్‌సీపీవో శ్రీలక్ష్మి, తహసీల్దార్ గుండాల్ నాయక్, ఏఎస్ఐ శంకర్ విచారణ నిమిత్తం మద్దికెరకు వచ్చారు. భార్యాభర్తలు మూడు నెలల క్రితమే రాజీ అయి కాపురం సవ్యంగా చేసుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలపడంతో అధికారులు కంగుతిన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ అందుబాటులో లేకపోవడంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

అప్పు తీర్చమని అడిగినందుకే హత్య

- కంట్లో కారం పొడి మారణాయుధాలతో దాడి
- నిందితులు అరెస్ట్.. ఇనుపరాడ్లు, సుత్తి, కత్తి స్వాధీనం
- పాణ్యం సీఐ కిరణ్‌కుమార్

పాణ్యం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అప్పు తీర్చమని అడిగినందుకే అశోక్ (37)ను దారుణంగా హత్య చేశారు. పాణ్యం సమీపంలో గోరుకల్లు రస్తాలో ఈ సంఘటన ఈనెల 20వ తేదీన చోటుచేసుకోగా నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం పాణ్యం సీఐ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆళ్లగడ్డ మండలం, శాంతినగరం గ్రామానికి చెందిన అశోక్ వద్ద పాణ్యంకు చెందిన ముసుగు సుబ్బయ్య రూ.48లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 26 లక్షలు తీర్చగా మిగిలిన రూ. 22 లక్షలు ఇవ్వమని అశోక్ పదేపదే ఒత్తిడి చేశాడు. ఎలాగైనా అప్పు ఎగ్గొట్టాలని సుబ్బయ్య పథకం వేశాడు. 20వ తేదీన అశోక్‌కు ఫోన్‌చేసి పాణ్యంకు పిలిపించాడు. సుబ్బయ్య, అతడి కుమారుడు సురేష్‌లు అతడితో గొడవపడ్డారు. వివాదం పెరగడంతో వారి వద్దఉన్న కారంపొడిని అశోక్ కళ్లల్లో చల్లి ఇనుపరాడ్లు, సుత్తితో తల, కడుపు, ఛాతీపై దారుణంగా పొడిచాడు. అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య శృతి ఫిర్యాదు మేరకు సుబ్బయ్య, సురేష్, తెలుగుపేటకు చెందిన సల్కాపురం రమేష్, నూలుమిల్లు కాలనీకి చెందిన ఎనకండ్ల బాలకృష్ణ, మేకలబండకు చెందిన మండ్ల మణికుమార్, గోడలచేలుకు చెందిన అనుపూరు మాబు హుశేన్‌పై హత్యకేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. సుగాలిమెట్ట సమీపంలోని ఏరాసు ప్రతాపరెడ్డి తోటలో ఉన్న నిందితులను అరెస్టు చేసి వారివద్ద నుంచి రెండు పిడి బాకులు, మచ్చుకత్తి, ఇనుప రాడ్లు, సుత్తి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఆళ్లగడ్డ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా మైనర్లను కర్నూలు జువెనల్ కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన జీఎస్టీ కమిషనర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల జీఎస్టీ జాయింట్ కమిషనర్ నీరజ గురువారం కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వ కంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె కలెక్టర్‌ను కలిసి పూలమొక్కను అందజేశారు. అనంతరం జీఎస్టీకి సంబంధించి అమలు చేయల్సిన పలు అంశాలపై వారు చర్చించారు.



కలెక్టర్‌కు మొక్కను ఇస్తున్న జీఎస్టీ కమిషనర్


నేడు టీజీవీ కళాక్షేత్రంలో 'శ్రీ చౌడేశ్వరీ దేవి వైభవం' ప్రదర్శన

కర్నూలు కల్చరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా తొగటవీర క్షత్రియ సేవా సంఘం, నందవరిక బ్రాహ్మణ సంఘం, దేవాంగ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'శ్రీ చౌడేశ్వరీ దేవి వైభవం' నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు కోఆర్డినేటర్ విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5:30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈ నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ కళా సంస్థ కళాకారులు హాజరవుతారన్నారు. నందవరం చౌడేశ్వరీదేవి దివ్యక్షేత్రం, అమ్మవారి మహిమలు, చారిత్రాత్మక నేపథ్యం ఆధారంగా రూపొందించిన ఈ నాటకాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించాలని కోరారు. నంది అవార్డు గ్రహీత పల్లేటి లక్ష్మి కులశేఖర్ రాసిన ఈ నాటకాన్ని ప్రొద్దుటూరు చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పామిలేటి దర్శకత్వం వహిస్తున్నారు.

కీలక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం..!

- అవుకులో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్
- రూ.53 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ రక్షణ పనులు
- డోన్‌లో రెండు పవర్ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్





గోరకల్లు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు(ఫైల్)

నంద్యాల, జూలై 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో కీలక అంశాలకు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో జిల్లాలకు పలు కీలక ప్రాజెక్టులకు అమోదం తెలిపి నిధులను కేటాయించారు. సదరు ఆమోదంతో రెండు జిల్లాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండటంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అవుకులో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు

బనగానపల్లె నియోజకవర్గం అవుకు మండలంలోని ఎంఎస్ ఆర్‌వీఆర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి పచ్చజెండా ఊపింది. గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఆ సంస్థ ఏర్పాటు చేసే పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు నిర్మించేందుకు కేబినెట్‌లో ఆమోదం పొందింది. ఈహైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు అవుకు రిజర్వాయర్‌నుంచి పంపింగ్ ద్వారా నీటిని తోడి ఆ నీటితో విద్యుత్ ఉత్పత్తిని చేసి తిరిగి రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేసే విధంగా ఈప్రాజెక్టును రూపొందించారు. ఈ పంప్డ్ హౌస్ నిర్మాణం వల్ల 800 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. అవుకు మండలం ఉప్పలపాడు, జూనూతల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు. 2023 డిసెంబరు 22న 4476.80 కోట్ల వ్యయంతో జలవిద్యుత్ ప్రాజెక్టు పనులపై గతంలో ఓ ప్రైవేటు కంపెనీకి అనుమతి ఇచ్చారు. ఈనేపథ్యంలో 2023లో అవుకు మండలం ఉప్పలపాడులో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రభుత్వం మారడంతో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రద్దు చేశారు. తిరిగి గురువారం కేబినెట్‌లో ఆర్‌వీఆర్ ప్రాజెక్టుకు అనుమతించారు.

డోన్‌లో రెండు పవర్ ప్రాజెక్టులు

కర్నూలు, నంద్యాల జిల్లాలకు ప్రయోజనకరంగా ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వంలో కేబినెట్‌లో డోన్ నియోజకవర్గంలో రెండు పవర్ ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే జిల్లా యంత్రాంగం డోన్ నియోజకర్గం ప్యాపిలి మండలం కలచట్ల, కొత్తకోట గ్రామ పరిసర ప్రాంతాల్లో స్థల సేకరణ చేసి పలు అంశాలపై ప్రభుత్వానికి నివేదిక పంపారు. తాజా కేబినేట్ సమావేశంలో ప్యాపిలి మండలం కలచట్ల గ్రామ శివారులో 300 మెగా వాట్లతో విండ్ పవర్ కెపాసిటీ కలిగిన పవర్ ప్రాజెక్టుకు అనుమతించారు. పైగా సదరు ప్రాజెక్టు పనులను సైతం రిన్యూ వ్యోమన్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించారు. ప్రాజెక్టు వ్యయం సుమారుగా రూ.1,500 నుంచి రూ.1,800 కోట్లు ఉండవచ్చు. ఆ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి రోజు ప్రాజెక్టు నుంచి సుమారు 20లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. అదే మండల పరిధిలోని కొత్తకోట సమీపంలో 600 మెగావాట్లతో విండ్ పవర్ ప్రాజెక్టుకు అనుమతించారు. సదరు ప్రాజెక్టు పనులను రిన్యూ విక్రమ్ శక్తి లిమిటెడ్‌కు అప్పగించారు. సదరు ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.3 వేల కోట్లు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రతి రోజు సుమారు రూ.40 లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పాదన చేసే అవకాశం ఉంది.

గోరుకల్లుకు రూ.53 కోట్లు

పాణ్యం మండల పరిధిలోని గోరకల్లు రిజర్వాయర్ (నరసింహరాయసాగర్) రక్షణ పనులకు రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలిపింది. సదరు రిజర్వాయర్ పనులకు సంబంధించి రూ.99 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపగా.. రూ.53 కోట్ల నిధులకు ప్రభుత్వం అమోదం తెలిపింది. దీంతో రిజర్వాయర్ పరిధిలో రోప్‌బండ్ లెవల్ వరకు మట్టి నిర్మాణం, వర్షపు నీరు సురక్షితంగా విడుదల చేయడానికి డ్రైనేజీ వ్యవస్థ, బండ్ పైభాగం నుంచి గేట్ వ్యవస్థ, 1500 మీటర్ల నుంచి 3,406 మీటర్ల మధ్య అప్‌స్ట్రీమ్ వాల్ రక్షణ, గ్యాలరీ మరమ్మతులు, గ్లౌడింగ్, స్లూయిజ్ గేట్ల నిర్మాణం, సెన్సార్ ఏర్పాటు, హెడ్ రెగ్యులేటర్ తదితర పనులను చేయనున్నారు.

మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట

- నేర నియంత్రణకు కృషి చేయాలి
- నేర సమీక్షలో డీఐజీ
- ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలు





'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్లను విడుదల చేస్తున్న డీఐజీ, ఎస్పీ... పాల్గొన్న పోలీసు అధికారులు

కర్నూలు క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగానికి అడ్డుకట్ట వేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా ఎస్పీతో కలిసి డీఐజీ కోయ ప్రవీణ్ జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. శాంతిభద్రతలను పరిరక్షణలో భాగంగా పోలీసులు సీరియస్‌గా పని చేస్తే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఉండదని తెలిపారు. జిల్లాల విభజన తర్వాత కర్నూలు రేంజ్‌లో జిల్లాలో ప్రశాంతమైన వాతావరణం ఉందన్నారు. పాత కక్షలు లేకుండా అందరికీ కౌన్సెలింగ్ చేయాలన్నారు. అలాగే ఎక్కడైనా అల్లర్లు జరగకుండా, ఓపెన్ డ్రింకింగ్ వంటివి లేకుండా డ్రోన్ కెమెరాలతో నిఘాతో విజిబుల్ పోలిసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయిస్తే న్యాయం జరిగేలా పని చేయాలన్నారు. సాంకేతిక నైపుణ్యం బాగా పెంచుకోవాలని డీఐజీ సూచించారు. అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించి నేరాల కట్టడికి బాగా పని చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో సీసీ కెమెరాల పనితీరు సక్రమంగా ఉండాలన్నారు. అవసరమైన చోట పీడీ యాక్టులు, బైండోవర్లు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేయాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, యాంటీ ఈవ్ టీజింగ్ తనిఖీలను డ్రోన్ కెమెరాలతో ఇంకా మెరుగు పరుచుకోవాలన్నారు. ప్రాపర్టీ కేసులలో రికవరీలు చేయానలి, ప్రాపర్టీ కేసులలో నిందితుల వేలిముద్రలను సేకరించి చేధించాలన్నారు. కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్‌కు వచ్చే విదంగా కృషి చేయాలన్నారు. ఫోక్సో కేసుల గురించి ఆరా తీశారు. అనంతరం గత నెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈగల్ టీం ఆధ్వర్యంలో 'గంజాయికి డ్రగ్స్‌కి గుడ్‌బై చెబుదాం, డ్రగ్స్ వద్దు బ్రో.. మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి' చేయాలనే కరపత్రాలను డీఐజీ, ఎస్పీ ఆవిష్కరించారు. జిల్లాలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు టోల్‌ఫ్రీ నెంబర్.1972కు సమాచారం అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, శ్రీనివాసాచారి, ఉపేంద్రబాబు, హేమలత, ఏఆర్‌డీఎస్పీ భాస్కర్‌రావు, సీఐలు, ఎస్ఐలు, ఈగల్ టీం ఎస్ఐ సుజన్ కుమార్, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

పలు ఫైళ్లకు మోక్షం

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాలకమండలి సమావేశం
- బయటకు పొక్కకుండా గోప్యత పాటించాలి
- పాలక మండలి సభ్యులకు ఓ ఉన్నతాధికారి ఆదేశం?

కర్నూలు అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆర్‌యూలో (రాయలసీమ యూనివర్సిటీ) గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న పలు ఫైళ్లకు మోక్షం లభించింది. గురువారం సాయంత్రం వర్సిటీ కాన్ఫరెన్స్ హాలు నుంచి పాలక మండలి సభ్యులతో ఉపకులపతి వి.వెంకట బసవరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, ప్రిన్సిపల్ సెక్రటరీ కోనశశిధర్, సెక్రటరీలతో కలిసి పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఓ కాంట్రాక్టు ఉద్యోగికి సంబంధించిన కోర్టు డైరెక్షన్‌లో ఉద్యోగి అంశం, పెండింగ్‌లో ఉన్న17 మంది ఉద్యోగులు, మరి కొందరు ఉద్యోగుల జీతభత్యాల పెంపునకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చినట్లు ఉన్నత విద్యామండలి వర్గాలు తెలిపాయి. సమీక్షలోని అంశాలు బయటకు పొక్కకుండా గోప్యత పాటించాలని వర్సిటీకి చెందిన ఓ ఉన్నతాధికారి మౌఖికంగా పాలకమండలి సభ్యులను ఆదేశించినట్లు సమాచారం. సమీక్షకు సంబంధించిన పలు అంశాలపై ఉన్నత విద్యాశాఖలోని అధికారుల వద్ద ప్రస్తావించగా మరిన్ని వివరాలను వర్సిటీ ఉన్నతాధికారులు వెల్లడిస్తారని దాటవేశారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో బాస్కెట్ బాల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 26న బాలబాలికల జూనియర్ బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి దాదాబాషా గురువారం తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. తమతో పాటు ఆధార్, పుట్టినతేదీ ధ్రువపత్రం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు క్రీడా ప్రాంగణంలో ఉండాలని సూచించారు. ఎంపికైన జట్టు ఆగస్టు 14 నుంచి 17 వరకు పిఠాపురంలో నిర్వహించే 10వ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాల కోసం 9700626167, 8309561333 నంబర్లను సంప్రదించాలన్నారు.

జీజీహెచ్ కిటకిట



ఆసుపత్రిలో గుమికూడిన రోగులు

నంద్యాల హస్పిటల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్ గురువారం రోగులతో కిటకిటలాడింది. ఓపీడీ భవనంలో మందులు తీసుకునేందుకు రోగులు బారులుదీరారు. అలాగే అల్ట్రాసౌండ్ ఓపీవద్ద అధికసంఖ్యలో రోగులు చికిత్స కోసం వచ్చారు. ఇటీవలే అల్ట్రాసౌండ్ విభాగానికి కొత్తగా వైద్యులు రావడంతో రోగులు చికిత్స కోసం జీజీహెచ్‌కు వస్తున్నారు. మూడు రోజులనుంచి ఓపీడీ విభాగంలో చికిత్సలు చేయించుకుంటున్న రోగులు మందుల కోసం క్యూకట్టారు. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు రావడంతో ప్రజలు జీజీహెచ్‌ను ఆశ్రయిస్తున్నారు.

రీ సర్వే విషయంలో ఘర్షణ

- భయాందోళనలో మారందొడ్డి గ్రామస్థులు

సి. బెళగల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని మారందొడ్డి గ్రామంలో నెల రోజులుగా రీ సర్వేను నిలిపివేశారు. గురువారం రెవెన్యూ అధికారులు రీసర్వేను ప్రారంభించారు. బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన వెంకటేశ్వర్లు, రుక్మాంగదకు పొలాలు ఉన్నాయి. రీసర్వే నేపథ్యంలో పొలాలకు రాళ్లు పాతే విషయంలో ఒకరినొకరు ఘర్షణ పడ్డారు. వెంకటేశ్వర్లు కుమారుడైన మోహన్‌నాయుడు తలకు రక్తగాయాలయ్యాయి. ఇరువురిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి మందలించి పంపారు. వెంకటేశ్వర్లు వర్గీయులు రుక్మాంగద ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. ఘర్షణ జరగడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఘర్షణ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు మారందొడ్డికి చేరుకొని ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చిరుత సంచారం

- ఎన్నెకండ్లలో దున్నపోతుపై దాడి
- భయాందోళనలో గంజిహళ్లి, ఎన్నెకండ్ల, బెల్లందొడ్డి వాసులు





గంజహళ్లి శివార్లలో చిరుత కాలి గుర్తులు, ఆందోళన వ్యక్తం చేస్తున్న సర్పంచ్, ప్రజలు

గోనెగండ్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్నెకండ్ల, గంజహళ్లి, బెల్లందొడ్డి గ్రామ శివార్లలో మూడు రోజులుగా చిరుత సంచరిస్తుంది. ఆయా గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి ఎన్నెకండ్లకి చెందిన నాగేంద్ర తన పంట పొలంలోని గుడిసె దగ్గర దున్నపోతును కట్టి వెళ్లాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా దున్నపోతు కనిపించలేదు. కొండ ప్రాంతాలను వెతకగా గుండ్ల మధ్యలో చిరుత దాడిలో మృతిచెందిన దున్నపోతు కళేబరం లభించింది. ఆ ప్రాంతంలో చిరుత జాడ (అడుగులు)లు కనిపించాయి. గురువారం తెల్లవారుజామున కూడా చిరుత దున్నపోతు కళేబరం ఉన్న ప్రాంతానికి వచ్చి వెళ్లినట్లు పశువుల కాపరులు తెలిపారు. చిరుత ఎన్నెకండ్ల, గంజహళ్లి, బెల్లందొడ్డి గ్రామాల పంట పొలాల్లో తిరుగుతున్నట్లు గ్రామస్థులు తెలుపుతున్నారు. గురువారం సాయంత్రం గంజహళ్లి గ్రామ శివారులో చిరుత కనిపించడంతో గ్రామస్థులు కేకలు వేస్తూ కట్టెలతో వెళ్లారు. చిరుత చెట్ల పొదల్లోకి పారిపోయినట్లు గంజహళ్లి సర్పంచ్ రాముడు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పం దించి చిరుతను బంధించి అటవీ ప్రాంతంలో వదలాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు: ఎమ్మెల్యే

నందికొట్కూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): యూరియా, ఇతర ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే ప్రైవేటు దుకాణాలు, అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హెచ్చరించారు. నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి సరస్వతి దేవి ఆలయంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసేందుకు రూ.96 లక్షలు, పాములపాడు మండలం మద్దూరు వీరభద్రస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు రూ.56 లక్షలు, నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో నూతనంగా సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.36 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నిధులు మంజూరు చేసిన దేవదాయశాఖామంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, జమీల్ ఉన్నారు.

జీవో నెంబరు 77ను రద్దు చేయాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్

నందికొట్కూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను దూరం చేసే జీవో నెంబర్ 77ను ఎప్పుడు రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో నంద్యాల నగరంలో రాష్ట్ర తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విద్యా వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విదేశీ విశ్వవిద్యాలయాలను దేశంలోకి ఆహ్వానిస్తూ యూనివర్సిటీలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రాథమిక పాఠశాలలను మూసివేసే జీవో 19, 20 లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్‌బాషా, నంద్యాల కార్యదర్శి రాంబాబు, రాష్ట్ర నాయకులు ఆది, రమణ, డివిజన్ నాయకులు జగదీష్, అజయ్, శ్యామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మరబోట్లు తిప్పితే చర్యలు'

కొత్తపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరంలోని శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చి చేరుతోందని, ఎవరైనా నదిలో మరబోట్లు తప్పితే చర్యలు తప్పవని తహసీల్దార్ ఉమారాణి హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ నిండు కుండలా ఉన్న శ్రీశైలం రిజర్వాయర్‌లో కొందరు ఎలాంటి పత్రాలు లేకుండా అధికారుల కన్నులు గప్పి మరబోట్లు తిప్పినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నది ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల మత్స్యకారులు కూడా చేపలవేటకు వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల అమల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆరోపించారు. పట్టణంలోని గొల్లపేట అరుగు వద్ద గురువారం బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రచ్చబండ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో లేనిపోని హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు నేడు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. అరకొర హామీలను అమలు చేస్తూ అన్ని చేశామని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మోసపూరిత హామీలతో సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, ఆయన చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తప్పుడు కేసులతో వైసీపీ నాయకులను బెదిరించడం దారుణమన్నారు. ఆ పార్టీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, సయ్యద్‌మీర్, అంజాద్‌అలి, మారుబత్తుల విజయ కుమార్, మునీర్‌బాషా, సుల్తాన్, బాలస్వామియాదవ్ ఉన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

కొత్తపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.వీరాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లపై అక్రమ కట్టడాలు తొలగించాలని ఎంపీడీవో దాసరి మేరీకి కాలనీవాసులు మొర పెట్టుకున్నారు. గురువారం గ్రామానికి చెందిన మల్లయ్య, భూషణం, పెద్ద లింగన్నలు ఎంపీడీవో మేరీని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వీరాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గతంలో ఆదర్శ గ్రామం కింద సీసీ రోడ్లు వేశారని, అయితే.. సీసీ రోడ్లు తరుగుగా ఉండటంతో వర్షం నీరు నిలిచిపోయి పాదాచారులకు ఇబ్బందిగా ఉందని అన్నారు. అంతేగాకుండా కాలనీవాసులు కొందరు సీసీ రోడ్లపై బిల్క్యు. మొరుసు వేయడంతో రోడ్లపై నీరు ఆగిపోయి వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా కొందరు ఏకంగా రోడ్లపై అక్రమ కట్టడాలు కట్టడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు.

యూరియా అందజేయాలి

పగిడ్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను అందజేయాలని పగిడ్యాల వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో రైతులు గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కన్వీనరు పక్కీర్‌సాహెబ్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంటలకు ఎరువులు వేసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో యూరియా కొరత ఏర్పడటంతో రైతులు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. అధికారులు, నిర్లక్ష్యం కారణంగా రైతులకు అవసరమైన ఎరువులు అందడం లేదని ఆయన ఆరోపించారు. సీపీఎం నాయకులు, రైతులు ఉన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

గడివేముల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని గడివేముల ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ స్కూల్‌లో విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు అలవాటు పడితే అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని అన్నారు. మత్తుపదార్థాలు తీసుకోవడం చట్టరీత్యా నేరం అన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జయంతి



మిడుతూరులో చౌడేశ్వరీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



బండిఆత్మకూరులో గ్రామోత్సవం



ఆత్మకూరులో హోమంలో పాల్గొన్న మహిళలు

ఆత్మకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోటగేరిలో చౌడేశ్వరీదేవి అమ్మవారి జయంతి వేడుకలు గురువారం శోభాయమానంగా జరిగాయి. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో గణపతిపూజ, అభిషేకాలు, అర్చనలు తదితర క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు. బోనాల ఊరేగింపు తొగటవీర క్షత్రియ సంఘం వారు సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బండిఆత్మకూరు: చౌడేశ్వరీదేవికి జన్మదినం సందర్భంగా తొగటవీర క్షత్రీయులు చీర, సారె సమర్పించారు. గురువారం స్థానిక వీవర్స్ కాలనీ నుంచి చౌడేశ్వరీదేవిని ప్రత్యేక పల్లకీలో కొలువుదీర్చి భజన, కోలాటం నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

గడివేముల: మండలంలోని గని గ్రామంలో ఆషాడమాసం అమావాస్య సందర్భంగా చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి గురువారం ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమర్‌నాథ్, దేవిదీప్తి, అఖిల, కార్తీకశర్మ ఆధ్వర్యంలో ప్రజలు అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహించారు. చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నందికొట్కూరు: పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆషాడమాస అమావాస్య రోజున అమ్మవారి జన్మదినం సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కొత్తపల్లి: కొత్తపల్లిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తొగట వీరశైవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



వెలుగోడులో..



పాములపాడులో..

మిడుతూరు: మిడుతూరులో చౌడేశ్వరి దేవి పుట్టిన రోజు వేడుకను తొగటవీర క్షత్రియులు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ అర్చన, అభిషేకాలు, పూర్ణకుంభ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాండ్ర సురేంద్రనాథ రెడ్డి, టీడీపీ మండల మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి దర్శించుకున్నారు.

పాములపాడు: పాములపాడులో చౌడేశ్వరీదేవి అమ్మవారి జయంతి వేడుకలను నిర్వహించారు. పురోహితుడు కోదండరామయ్య శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో జయంతి వేడుకలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు రామయ్య, రవీంద్రుడు, వెంకటయ్య, శేషయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరు, కొత్తపల్లి, గని గ్రామాల్లో పూజలందుకున్న అమ్మవారు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సున్నిపెంట: 'తొలి అడుగు'లో పాల్గొన్నఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



అలగనూరులో కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నంద్యాల కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సున్నిపెంట పరిధిలోని వైజాగ్ క్యాంప్‌లో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిడుతూరు: సుపరిపాలనతో సక్షేమం, అభివృద్ధి అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అనా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం మండల పరిధిలోని అలగనూరు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి కరపత్రాలను అందించారు. మిడుతూరు గ్రామానికి చెందిన సయ్యద్ ఖైరున్‌బికి రూ.40 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సుధాకర్, నాయకులు శేషి రెడ్డి, శ్రీనివాసులు, సర్వోత్తమరెడ్డి, రామచంద్రుడు, శివరామి రెడ్డి, రామస్వామి రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులోని 163వ బూత్‌లో గ్రామ అధ్యక్షుడు బైరెడ్డి లక్ష్మిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ జాకీర్ ఖాన్, అంజాద్ ఆలి ఇంటింటా తిరిగి ఇంతవరకు అందిన పథకాలను, ప్రజల సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రతి హామీలన్నీ నెరవేరుస్తున్నారని చెప్పారు.

సాయిబాబా ఆలయంలో కలెక్టర్ పూజలు



సాయిబాబాను దర్శించుకుంటున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నంద్యాల బొమ్మలసత్రంలో వెలసిన సాయిబాబా ఆలయాన్ని గురువారం నంద్యాల కలెక్టర్ రాజకుమారి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హారతి కార్యక్రమాన్ని హాజరై బాబాను దర్శనం చేసుకున్నారు. ముందుగా కమిటీ సభ్యులు, వేదపండితులు కలెక్టర్ రాజకుమారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజలు అనంతరం కలెక్టర్ ఆలయాన్ని చుట్టూ ప్రదక్షిణ చేశారు. హారతి తీసుకున్న తర్వాత కలెక్టర్ ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయి కమిటీ సభ్యులు, సాయి సేవకులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

మహానందిలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి

మహానంది, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో గురువారం జార్ఖండ్ ఆర్‌డబ్ల్యూఎస్ నేషనల్ అథారిటీ అధికారి శిరోంజిబ్ సాఖియా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహానంది ఆలయ ముఖ మండపం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో ఆయన స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ ఉన్నారు.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

ఆత్మకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, అధ్యక్షులు రజాక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని విరమించుకోవాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతంలో సగం పింఛన్ సదుపాయం ఇవ్వాలన్నారు. సమావేశంలో సీఐటీయు నాయకులు రణధీర్, సురేంద్ర, రవూఫ్, తిమ్మయ్య, మంజుల, ప్రభావతి, బేగం, శాంతకుమారీ తదితరులు ఉన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

పగిడ్యాల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నుంచి పగిడ్యాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపుల గుంతలుమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిదులు చర్యలు తీసుకొని గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపటాటలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రహదారిని ఆయన గురువారం పరిశీలించారు. పార్టీ నాయకులు సుదాకర్, రామనాయుడు ఉన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

పాములపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఎరువుల గూర్చి ఆందోళన చెందవద్దని, ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి మహేశ్వరరెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గురువారం మండలంలో మద్దూరు, వాణాల, మిట్టకందాల, ఇస్కాల, బనకచెర్ల, చెలిమిల్ల, పాములపాడు, ఎర్రగూడూరు, వేంపెంట, బానుముక్కల, జూటూరు గ్రామాలలో రైతు వ్యవసాయ కేంద్రాల ద్వారా 469.86 మెట్రిక్ టన్నుల యూరియా, 68 మెట్రిక్ టన్నుల డీఏపీ, 12 టన్నులు కాంప్లెక్స్ ఎరువులను పంపిణీ చేశామని తెలిపారు. 25వ తేదిన వాణాల, ఎర్రగూడూరు, బనకచెర్ల, బానుముక్కల, మద్దూరు, జూటూరు గ్రామాలకు 137. 82 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. ఎరువుల కొరత లేకుండా చూస్తామని ఆయన సూచించారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు

ఆత్మకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీలోని విద్యార్థినులకు జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు షేక్షావలి మాట్లాడుతూ విద్యార్థులు కంటి సమస్యల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకించి విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ఎక్కువగా సెల్‌ఫోన్ చూడటం వల్ల కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో ఆకు కూరలు, పాలు, గుడ్లు తగిన మోతాదులో వాడాలని సూచించారు. దృష్టి లోపం ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా దృష్టి లోపం ఉన్న వారికి ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆత్మరక్షణపై అవగాహన

నంద్యాల టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణా పీజీ కళాశాలలో శక్తి టీం ఆధ్వర్యంలో ఆత్మరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శక్తి టీం నోడల్ ఆఫీసర్, అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ మహిళలు రక్షణ కోసం విద్యలో మంచి శిక్షణ నేర్చుకొని రేపటి సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. మొబైల్ వ్యసనం లాంటిదని, మొబైల్ వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. అనంతరం ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ మాట్లాడుతూ ఏదైనా అపాయం సంబవించినప్పుడు మహిళలు తమకు తాము రక్షణ కల్పించుకోవాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణా విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ జయరాం, ఏఎస్ఐ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'సినిమా టికెట్ ధరలు తగ్గించాలి'

నందికొట్కూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హరిహర వీరమల్లు సినిమా కోసం టికెట్ ధరలు పెంచుతూ తీసుకున్న ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సామాన్యులకు అన్నింట అధిక ధరల పెంపుతో చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం చివరికి వినోదం కోసం సినిమా విడుదలకు ఒక రోజు ముందు బెనిఫిట్ షో పేరుతో రూ.300 నుంచి రూ.500 వరకు వసూళ్లు చేయడం దారుణమన్నారు. బెనిఫిట్ షో పేరుతో ప్రేక్షకులను దోపిడీ చేసే విధానాన్ని అదుపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, అన్వర్, వలి, వెంకటేశ్వర్లు, నాగ శేషులు, శ్రీకాంత్, వెంకటరమణ, సుబ్బరాయుడు, తదితర ప్రేక్షకులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలి

● జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి



శాతనకోటలో పర్యటిస్తున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

నందికొట్కూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యానికి అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని శాతనకోట, అల్లూరు గ్రామాల్లో గురువారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ తో కలిసి పర్యటించారు. డ్రైనేజీలను, నీళ్ల ట్యాంకులను పరిశీలించారు. గ్రామ సెక్రటరీ రహీంను పరిశుభ్రత గురించి, నీళ్ల ట్యాంకులను ప్రతి వారం శుభ్రపరుస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి పూజలు

బండిఆత్మకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ శివారులో వెలసిన ఏకరాతి శిలా అభయాంజనేయ స్వామికి అమావాస్య పూజలు చేశారు. గురువారం ఆలయ నిర్వాహకులు శినాగరాజునాయక్, నాగేశ్వరరావునాయక్, రవితేజనాయక్ స్వామి వారికి వేకువజామునే అర్చకులతో అభిషేకాలు, ఆకుపూజలు, అర్చనలు చేయించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్‌నాయక్, శివనాయక్, నాగరాజు, శివన్న, రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం అమావాస్య పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు, ఆకుపూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బండిఆత్మకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): కుందూ నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. గురువారం ఆయన సంతజూటూరు సమీపంలోని పికప్ ఆనకట్ట వద్ద నీటి ఉధృతిని సిబ్బందితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా చేపల వేటగాళ్లు, పశుల కాపరులు, పర్యాటకులు జాగ్రత్తగా ఉండాలని, స్థానికంగా ఉండే మత్స్యకారులు కొత్తవారిని నదిలోకి దిగనివ్వరాదని ఎస్ఐ సూచించారు. సమీప గ్రామాల ప్రజలు నదిని దాటే ప్రయత్నాలు చేయవద్దని, ప్రవాహం మరింత పెరిగవచ్చని తెలిపారు.

ఉద్యోగులకు బదిలీ సహజం: ఎంపీడీవో

మహానంది, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని అని మహానంది మండల ఎంపీడీవో మహమ్మద్ దౌలా అన్నారు. గురువారం మండలంలోని ఎం.తిమ్మాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఇక్కడ పనిచేస్తూ జిల్లాలోని వివిధ ప్రదేశాలకు బదిలీపై వెళ్తున్న అధికారులకు డిప్యూటీ ఎంపీడీవో నాగేంద్రుడు, పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గాజులపల్లి పీహెచ్‌సీలో బదిలీ అయిన సిబ్బందిని వైద్యాధికారి వెంకటరెడ్డి, ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఆర్థిక సాయం అందజేత

పాములపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట గ్రామంలో టీడీపీ కార్యకర్త బొల్లారం వెంకటరత్నమ్మ (55) అనారోగ్యంతో మృతి చెందడంతో రూ.5 వేల ఆర్థిక సాయాన్ని టీడీపీ నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ, వారి కుమారుడు టీడీపీ నాయకులు సింగపూరు తెలుగు సమాజం అధ్యక్షుడు టేకూరి నాగేశ్వరరావు ఇచ్చిన డబ్బులను అందించారు. టీడీపీ నాయకులు సత్యరాజ్, ఆల్ఫ్రెడ్, టేకూరి శ్రీనివాసులు, యువరాజు, బాస్కర్, రాజేశ్, సుబ్బరావు వినయ్, మొలక రాజు, జనసేన నాయకులు శేషు, విశ్వనాధం, నాగరాజు పాల్గొన్నారు.

28న బహిరంగ వేలం

నంద్యాల కల్చరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో వెలసిన కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం, బ్రహ్మానందీశ్వరస్వామి దేవసానం, లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానాలకు చెందిన ఖాళీ స్థలాలను కౌలు ఇచ్చేందుకు ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయాల ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని మల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఆలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని ఈవో సూచించారు.

కంప్యూటర్ నైపుణ్య పరీక్ష నిర్వహించాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఉద్యోగ అభ్యర్థులకు జిల్లాస్థాయిలో కంప్యూటర్ నైపుణ్య పరీక్షను నిర్వహించాలని టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర సాధారణ పరిపాలన(సేవలు, హెచ్‌ఆర్‌ఎం) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్‌ను రాష్ట్ర సచివాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మోహన్‌గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి బీసీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లో ఉన్నజీవో నం.69 గడువు ముగియనున్న దృష్ట్యా పొడిగించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్‌ను కోరడం జరిగిందన్నారు. అలాగే టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ సమస్యలను వారి దృష్టిగా తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఆత్మకూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల దరఖాస్తుకు గడువు పెంచినట్లు సీడీపీవో కోటేశ్వరి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఆత్మకూరు ఐసీడీఎస్ పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, 5 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 1వ తేదిన నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. అయితే కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తులను స్వీకరించేందుకు ఈ నెల 31వ తేది వరకు గడువు పెంచినట్లు తెలిపారు. బండిఆత్మకూరు మండలంలోని నాయుని చెరువు చెంచుగూడేనికి సంబంధించి అంగన్‌వాడీ వర్కర్ (ఎస్టీ-మహిళ) పోస్టుకు కూడా దరఖాస్తులను ఆహ్వానించినట్లు తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నందు ఈ నెల 31వ తేది సాయంత్రం 5గంటల్లోగా అందజేయాలని సూచించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస గౌడ

నందికొట్కూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులుగా నియోజకవర్గానికి చెందిన మానపాటి శ్రీనివాస గౌడ నియమితులయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీని వీడిన మిడ్తూరు మండలం పైపాలెం గ్రామానికి చెందిన మానపాటి శ్రీనివాస గౌడ బీజేపీలో చేరారు. నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు జిల్లా ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, జిల్లా సెక్రటరీ, ట్రెజరర్,సోషల్ మీడియా కన్వీనర్లను నియమించారు. అందులో భాగంగా నందికొట్కూరు నియోజకవర్గానికి చెందిన మానపాటి శ్రీనివాసగౌడను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు


బనగానపల్లెలో పర్యటిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి

బనగానపల్లె, జూలై 24(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఎస్ఐ దుగ్గిరెడ్డి, పోలీస్ సిబ్బందితో కలసి పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించారు. ట్రాఫిక్ నియంత్రణకు దుకాణదారులు వాహనచోదకులు, ప్రజలు సహకరించాలన్నారు.

సారా విక్రయంపై నిఘా

కొలిమిగుండ్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో నాటుసారా విక్రయంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సీఐ రమేశ్‌బాబు వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నాటు సారా విక్రయాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. నాటుసారాతో పాటు పేకాట, మట్కా, గుట్కా లాంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.

కొలిమిగుండ్లలో మోస్తరు వర్షం

కొలిమిగుండ్ల,, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 15.4 మి.మీ. వర్షపాతం నమోదయినట్లు ఏఎస్‌వో భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని కొలిమిగుండ్ల, కల్వటాల, కనకాద్రిపల్లె, మదునాంతపురం, అబ్దుల్లాపురం, చెన్నంపల్లె తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి నుంచి ఓ మోస్తరు వర్షంకురిసింది. దీంతో మండలంలో అన్నదాతలు సాగు చేసిన వివిధ పంటలకు ఎంతగానో ఊపిరిపోసింది., ఖరీఫ్ సాగుకోసం సిద్ధమవుతున్నారు.

ఆదాయ పన్ను చెల్లింపు బాధ్యతగా భావించాలి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్ను చెల్లించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీకళాశాల వైస్ ప్రిన్సిపాల్ యు.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కోవెలకుంట్లలోని ఆ డిగ్రీ కళాశాలలో ఆదాయ పన్నుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు కె.రాజశేఖర్, ఈవీ భాస్కర్‌రెడ్డి, హెచ్.రామసుబ్బారెడ్డి, నరేంద్రనాథరెడ్డి, సుభాష్‌రెడ్డి, లక్ష్మీదేవి, అన్నపూర్ణ, క్రిష్ణశశాంక, నాగేశ్వర్‌రెడ్డి, నంటిరెడ్డి, కృష్ణదాస్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న నంద్యాల పట్టణంలోని సౌజన్య ఫంక్షనహాలులో జరిగే బీజేపీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓ.లోకేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కోవెలకుంట్లలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని చిన్నబోదనం గ్రామంలో గురువారం డెంగీ మాసోత్సవ ర్యాలీ వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, ఏఎన్‌ఎం పద్మావతి, మనోహర్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చాగలమర్రి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలుగు యువత అధ్యక్షుడు మాబులాల్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తినరసింహులు అన్నారు. గురువారం చాగలమర్రిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటగడ్డ, కుమ్మరి వీధులలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంచాలి: ఎంఈవో


పెద్దబోదనం పాఠశాలలో పాఠం చెబుతున్న ఎంఈవో అనూరాధ

చాగలమర్రి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలని, నాణ్యమైన బోధన చేయాలని ఎంఈవో అనూరాధ సూచించారు. గురువారం మండలంలోని పెద్దవంగలి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయం ఎదుట చిత్తడి



రుద్రవరం వ్యవసాయ కార్యాలయం ముందు వర్షపు నీరు

రుద్రవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం వ్యవసాయ కార్యాలయంముందు వర్షం నీరు చేరి చిత్తడిగా మారింది. రైతుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కార్యాలయం ముందు వర్షం నీరు నిల్వ చేరాయి. అధికారులు కూడా కార్యాలయానికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు.

ఆలస్యమైనా.. చిగురిస్తున్న ఆశలు

- వారం రోజులుగా మారిన వాతావరణం
- అల్పపీడన ద్రోణితో జోరుగా కురుస్తున్న వర్షాలు
- ఖరీఫ్ పంటలకు ఊపిరి పోస్తున్న వైనం

కొలిమిగుండ్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): కాస్త ఆలస్యమైనా అన్నదాతలు ఆశలు చిగురిస్తున్నాయి. ఖరీఫ్ సాగు ప్రారంభమై నెల రోజులు దాటినా వరుణుడి జాడ లేక పోవడంతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మెట్ట భూముల్లో సాగు చేసిన పంటలు వాడు ముఖం పట్టగా, సాగుకు నోచుకోని భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఖరీఫ్ పంటలు దక్కేలాలేవని కర్షకులు కంటతడి పెట్టారు. పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని ఆవేదన చెందారు. ఈపరిస్థితుల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతల్లో కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి. బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. దీంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈ వర్షాలు కొత్త ఊపిరి పోస్తున్నాయి. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 2లక్షల హెక్టార్లు కాగా, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇందులో 50శాతం


కళకళలాడుతున్న జొన్న పంట


కొలిమిగుండ్లలో కురుస్తున్న వర్షం

సాగు కూడా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. రైతులు సాగు చేసిన కంది, మిరప, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వర్షం కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతల ఆశలకు ఊపిరి పోస్తున్నాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా మే నెలలో సాధారణ వర్షపాతం కంటే 70శాతం వర్షపాతం అధికంగా నమోదైంది. జూన్ మాసంలో నంద్యాల జిల్లా సాధారణ వర్షపాతం 78 మి.మీ. కాగా, కేవలం 55మి.మీ వర్షపాతం మాత్రమే కురిసింది. ఇక జులై సాధారణ వర్షపాతం 142 మి.మీ. కాగా, ఇప్పటివరకు 130మీ.మీ వర్షపాతం కురిసినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే జోరుగా కురుస్తున్న వర్షాలకు తోడు నేడు గురువారం మరోసారి బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. దీంతో రైతుల్లో ఖరీఫ్ గట్టెక్కవచ్చనే ఆశాభావం అన్నదాతల్లో నెలకొంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కురిసిన ఓమోస్తారు వర్షాలతో అన్నదాతలు పంటలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. కంది, మినుము తదితర పంటలను సాగు చేయడానికి అన్నదాతలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. మారిన వాతావరణంతో మరిన్ని వర్షాలు కురిస్తే అన్నదాతల ఆశలు పలించే అవకాశం ఉన్నట్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి


నందవరంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూలై 24(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సూచించారు. చౌడేశ్వరీమాత జయంతి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తన తల్లిదండ్రులు బీసీ లక్ష్మమ్మ, బీసీ గుర్రెడ్డి జ్ఞాపకార్థం చౌడేశ్వరీమాత జయంతి సందర్భంగా నందవరంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన యువకులను అభినందించారు. రక్తదాతలకు బీసీ రాజారెడ్డి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఆలయ సిబ్బంది, రక్తదాతలు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి సహకారం: నందవరం ఆలయాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. గురువారం చౌడేశ్వరీమాత జయంతి సందర్భంగా బీసీ రాజారెడ్డి నందవరంలో వెలసిన చౌడేశ్వరీమాతను దర్శించుకున్నారు. ఆయనకు అసిస్టెంట్ కమిషనర్, శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, పూజారులు స్వాగతం పలికారు.

విద్యార్థులకు మినరల్ వాటర్ అందిస్తా: బనగానపల్లెలోని హాస్టల్ విద్యార్థులకు మినరల్ వాటర్ అందిస్తానని, పట్టణంలోని రవ్వలకొండలో వెలసిన జ్యోతిరావుఫూలే గురుకుల పాఠశాల, కేజీబీవీలో సొంత నిధులతో ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బీసీ రాజారెడ్డి తెలిపారు. గురుకుల పాఠశాల హాస్టల్‌లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బీసీ రాజారెడ్డి స్థల సేకరణ గావించారు. వార్డెన్ నాగేంద్ర, బాలాజీ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం


మొక్క నాటుతున్న వలసల రామకృష్ణ తదితరులు

డోన్ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, ప్రభుత్వ వైద్యురాలు డా.రమ్యశిల్పా, పాఠశాల ప్రిన్సిపాల్ వసుంధరాదేవి పిలుపునిచ్చారు. పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో గురువారం స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి వారు హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో వలసల బాలుడు, స్ఫూర్తి సేవా సమితి సభ్యులు మధు, జహంగీర్, భాస్కర్, చంద్ర, మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు రంగనాథ్, రాజు యాదవ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'వైసీపీతోనే పేదలకు న్యాయం'

ఉయ్యాలవాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంతోనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మాయలూరు, అల్లూరు గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించకుండా ఈ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ మండల ఇన్‌చార్జి బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మాయలూరు సర్పంచ్ సాయిరెడ్డి, అల్లూరు మాజీ సర్పంచ్ శివరామకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రామదాసురెడ్డి, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

ఉయ్యాలవాడ, జూలై 24(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా సచివాలయాల డిజిటల్ అసిస్టెంటులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఆన్‌లైన్ సర్వీసులు పెంచాలన్నారు. అలాగే ప్రతి సచివాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటయ్యేలా ప్రతిఒక్కరూ ఈసీఎంటీ పరీక్ష రాసి ఉత్తీర్ణులు అవ్వాలని సూచించారు. స్థానిక బీసీ హాస్టల్‌ను ఎంపీడీవో తనిఖీ చేశారు.

విశ్వబ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చాగలమర్రి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు తక్షణమే స్వయం ప్రతిపత్తికలిగిన కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కోరారు. విశ్వకర్మ నాలేడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు విశ్వనాథుల పుష్పగిరి ఆధ్వర్యంలో జూలై 6న ప్రారంభించిన విశ్వబ్రాహ్మణ చైతన్య పాదయాత్ర గురువారం చాగలమర్రికి చేరింది. వీరికి స్థానిక విశ్వబ్రాహ్మణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక బ్రహ్మంగారిమఠంలో ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ 27న బ్రహ్మంగారిమఠం చేరుకొని పాదయాత్ర ముగుస్తుందని చెప్పారు. విశ్వబ్రాహ్మణులు బాలనరసింహాచారి, రంజిత్, సతీష్, యాదగిరి, మహేంద్రాచారి, శంకరాచారి, బ్రహ్మయ్య, కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం

చాగలమర్రి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యమని డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్ తెలిపారు. గురువారం శెట్టివీడు గ్రామంలో పీ-4 గ్రామసభ నిర్వహించారు. 76 బంగారు కుటుంబాలను గుర్తించి ఆ కుటుంబాలను టీడీపీ నాయకులు దత్తత తీసుకున్నారు. నాయకులు నరసింహారెడ్డి, మహబూబ్‌బాషా, సురేంద్రనాథ్, ప్రసాద్, కార్యదర్శి ఆదినారాయణ, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి

డోన్ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని రూపుమాపేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ-4 ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిందని, ఇందులో భాగంగా బంగారు కుటుంబాలను త్వరగా గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు సూచించారు. గురువారం పట్టణంలోని 15, 16 సచివాలయాల్లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. నాయకులు కేఈ శ్యాం, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ స్పెషల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

కాళబైరవ స్వామికి పూజలు

కొలిమిగుండ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల కొండపై వెలసిన కాళబైరవస్వామికి అమవాస్య పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేరం బయ్యపురెడ్డి, నందకిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆషాడం అమవాస్య పురస్కరించుకొని కాళబైరవ స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేపట్టారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

డోన్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని డోన్ రూరల్ ఎస్ఐ మమత సూచించారు. మండలంలోని కోట్లవారిపల్లె గ్రామ ప్రధాన రోడ్డులో గురువారం రూరల్ ఎస్ఐ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు ఆమె జరిమానాలు విధించారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జయంతి

బనగానపల్లె, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత జయంతి వేడుకలు గురువారం అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమావాస్య సందర్భంగా అమ్మవారి జయంతి వేడుకలను తిలకించడానికి వివిధ ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బీసీ ఇందిరమ్మ చౌడేశ్వరీ మాతకు, చీర, సారె, పండ్లు సమర్పించారు. బీసీ ఇందిరమ్మకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం ఈవో, చైర్మన్ ఆమెకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ అన్నదాన సత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కొలిమిగుండ్ల: కోటపాడు, కనకాద్రిపల్లె, కొలిమిగుండ్ల, కల్వటాల తదితర గ్రామాల్లో చౌడేశ్వరి జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో టీడీపీ బనగానపల్లె నియోజకవర్గం కో కన్వీనర్ వీఆర్ లక్ష్మిరెడ్డి అమ్మవారి జయంతి ఉత్సవాల్లో పాల్గొని నూతన వస్త్రాలు అందించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు రామయ్య వీఆర్ లక్ష్మిరెడ్డికి సత్కరించి ఆశీర్వాదాలు అందించారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతపేటలో ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పూజలు నిర్వహించారు. భీమునిపాడు, కలుగొట్ల, జోళదరాశి, రేవనూరు, చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల, గుళ్లదుర్తి, సౌదరదిన్నె తదితర గ్రామాల్లో భక్తులు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం వీధిలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం చౌడేశ్వరీదేవి జయంతి ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు దామోదర్, రఘురామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకముందు మహిళలు గంగమ్మ ఆలయం నుంచి చీర, సారె, పసుపు, కుంకుమలతో పురవీధుల గుండా గ్రామోత్సవంతో ఆలయానికి చేరుకొని చౌడేశ్వరీదేవికి సమర్పించారు. సామూహిక వడిబియ్యం సమర్పించారు. భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. కన్వీనర్ లక్ష్మీదేవి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం చౌడేశ్వరీదేవి జయంతి సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రిష్టిపాడు గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు.


బేతంచెర్లలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు


నందవరం చౌడేశ్వరీదేవికి చీర, సారె తీసుకెళ్తున్న బీసీ ఇందిరమ్మ


చాగలమర్రిలో..


సుద్దమల్లలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం చౌడేశ్వరీమాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇంజేడు గ్రామంలో అర్చకుడు అనంతశర్మ అమ్మవారికి అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి కేక్‌కట్ చేసి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. సుద్దమల్ల గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బేతంచెర్ల: పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో వెలసిన చౌడేశ్వరీ దేవి అమ్మవారి జయంతి సందర్భంగా భక్తులు పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గౌరి హుస్సేన్ రెడ్డి, అధ్యక్షుడు మల్లు సుబ్బారెడ్డి, మల్లిపెద్ది రఘురామిరెడ్డి, చౌడేశ్వరి శ్రీను, మద్దిలేటి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో ఆర్డీవో సమావేశం

ఆళ్లగడ్డ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో నంద్యాల ఆర్డీవో, ఎన్నికల అధికారి విశ్వనాథ్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా నియోజక వర్గం పరిధిలో గల పోలింగ్ కేంద్రాల మార్పులు, 1200 దాటిన ఓట్ల పోలింగ్ కేంద్రాల బీఫర్ కేషన్ గురించి చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, వివిద పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆటల పోటీలు

బేతంచెర్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్లలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో శుక్ర, శనివారాల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం కమిటీ సభ్యులు మారుతి కృష్ణన్ కోరారు. గురువారం పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిరం ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ పోటీలను విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. నంద్యాల, కర్నూలు విభాగ్ స్థాయిలో నిర్వహించే ఆటల పోటీల కరపత్రం పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు ఈఎస్ మారుతి కృష్ణన్, ఎం.మధు మోహన్ రెడ్డి, ఎస్.మద్దిలేటి స్వామి, గౌరీ హుస్సేన్ రెడ్డి విడుదల చేశారు. ఖో-ఖో, కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్, చదరంగం పోటీలు, పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్మిక సమస్యలపై పోరాటం

అవుకు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కార్మికులు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ నాయకులు అన్నారు. డోన్ పట్టణంలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్న సీపీఐ రెండవ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి నాగాంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం అవుకులో పోస్టరును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ప్యాపిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30, 31న డోన్‌లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి మహేష్ పిలుపు నిచ్చారు. గురువారం పట్టణంలో మహాసభలకు సంబందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. s నాయకులు వెంకటేష్, శ్రీనివాసులు, గోవిందు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

ఆళ్లగడ్డ, జూలై 24(ఆంధ్రజ్యోతి): విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వృక్ష యజ్ఞం సేవా సమితి వ్యవస్థాపకురాలు లావణ్య సూచించారు. ఆళ్లగడ్డలోని ప్రతాప్ సినిమా థియేటర్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కు, ప్రేక్షకులకు ఉచితంగా మొక్కలను అందజేశారు. జనసేన పార్టీ రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు మాబుసేన్, నాయకులు నాగప్రసాద్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: సీఐ

డోన్ రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ రూరల్ సీఐ సి.ఎం.రాకేష్‌బాబు అన్నారు. మండలంలోని చిన్నమల్కాపురం గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రూరల్ పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణకృత అలంకారంలో వాసవీమాత

ప్యాపిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం పురస్కరించుకొని పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వాసవి మాత గురువారం స్వర్ణకృతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ఆర్యవైశ్య భక్తులు పాల్గొన్నారు.

వెంకటరామయ్యకు నివాళి

ప్యాపిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలిలోని లైబ్రరీలో గురువారం గ్రంథాలయ పితామహుడు వెంకటరామయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నీటి సామర్థ్యం పెంపు

రుద్రవరం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాలువకు నీటి సామర్థ్యం పెంచినట్లు గురువారం అధికారులు తెలిపారు. 2500 క్యూసెక్కుల నుంచి ఐదువేల క్యూసెక్కులకు నీటి ప్రవాహ సామర్థ్యం పెంచారు. గంగ ప్రధానకాల్వలో కృష్ణాజలాలు గలగలా ప్రవహిస్తున్నాయి.